
# డబ్బు బంధం



''నువ్వు ఉద్యోగం చెయ్యడమేంటమ్మా?'' ఆశ్చర్యం వ్యక్తం చేశాడు రామం.

''అవున్రా రామం, నేను ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నాను'' మళ్ళీ అందావిడ.

''నీకిపుడు ఉద్యోగం చెయ్యవలసిన కర్మేం వచ్చింది?'' కోపంగా అన్నాడు.

''ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడి ఎవరి జీవితం వాళ్ళు గిరిగీసుకుని గడుపుతున్న కరువురోజులివి. ఆప్యాయతానుబంధాలు మృగ్యమైపోయి, అన్ని బంధాలని శాసిస్తున్న డబ్బు కాలమిది. మీ నాన్నగారు బ్రతికుండగా నాకు కష్టమంటే ఏమిటో తెలియదు. ఒకసారాయన నాతో 'పార్వతీ, రేపు నేను వుంటానో? వుండనో? పరిస్థితులు నీకు అనుకూలంగా వుంటాయో? వుండవో? నువ్వెవరి పంచనా 'దేహీ' అని బ్రతిమిలాడుతూ వుండనక్కరలేదు. నువ్వు చదుకోవాలి' అని నేను చదవనంటున్నా నాచేత బలవంతంగా డిగ్రీ చేయించారు.

రెండేళ్ళ క్రితం ఆయన పోయేదాకా నాకా డిగ్రీతో అవసరం పడలేదు. కానీ సంవత్సరం నుండీ ఈ ఇంట్లో నేను ఉద్యోగం చెయ్యవలసిన అవసరం వుందనిపిస్తోంది. ఇది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు. ఎంతో ఆలోచించిన మీదట తీసుకున్న నిర్ణయం'' గంభీరంగా అందావిడ.

''ఏదో మనకున్న దాంట్లో కల్గోగంజో తాగి బ్రతుకుతున్నాం కదా! నీకేంలోటు చేశాం?''

''ఆ... సంపాదిస్తూ, చేతికందొచ్చిన కొడుకుండగా ఈవిడగారు తగుదునమ్మాని వీధుల్లో తిరుగుతూ ఉద్యోగం చేస్తుంటే లోకం మన గురించి ఏమనుకుంటుంది? ఈవిడ్ని నానారకాల బాధలు పెడుతున్నామనుకోదూ. హాయిగా 'కృష్ణారామా' అంటూ ఒక మూల కూర్చోక, ఈ వయసులో ఇలాంటి ఆలోచనలేంటో? ఈవిడకి!'' బుగ్గలు నొక్కుకుంటూ అంది కమల రామం భార్య.

''నాకేం లోటు చేశారా... ఇంటిపని ఎంత చేసినా సానుభూతి వుండదు. ఎప్పుడో మీకు తోచినపుడు మీరుపెట్టే ముతక బట్టలు కట్టుకోవాలి. నాకంటూ ఎటువంటి అభిరుచులుండకూడదు. పండుగలకి, పబ్బాలకి నా విషయంలో ఎటువంటి ప్రత్యేకతా వుండదు. బంధువుల ఇళ్ళలో జరిగే శుభకార్యాలకివెళ్ళే స్వేచ్ఛలేదు. , రోగమొచ్చినా, రొచ్చొచ్చినా మందులిప్పించమని మిమ్మల్ని ప్రాధేయపడాలి. ఆయన పోయినప్పటినుండి నన్ను జీవచ్ఛవంలా చూస్తున్నారు. పైకి అనకపోయినా మీరు నన్ను భారంగానే భావిస్తున్నారు. ఆయనవున్నపుడు ఎంతో సంతోషంగా బ్రతికిన నేను ఇప్పుడీ పరిస్థితులకి తట్టుకోలేకపోతున్నాను. మీదనేసూటిపోటి మాటలు భరించలేకపోతున్నాను. నాకూ కోరికలుంటాయి. నేనేం గొప్పగా సుఖపడిపోవాలని కోరుకోవట్లేదు. కానీ బ్రతికినంత కాలం మనిషిగా బ్రతకలనుకుంటున్నాను. ఆయన అనేవారు ''దురదృష్టవశాత్తూ.. రేపు నేనేమన్నా అయితే నువ్విప్పుడున్నంత ఆనందంగానూ వుండాలి'' అని, నేనంటే అంత అభిమానం, ప్రేమ ఆయనకి. గడచినరెండేళ్ళ కాలం నేను ఎలా గడిపానో మీకు తెలుసు.

అయితే తప్పు మీదనను. మధ్యతరగతి జీవితాలెలాంటివో తెలుసు నాకు. ఒకప్పుడు భర్త సంపాదిస్తుంటే భార్య ఇంటిని చక్కదిద్దేది. తర్వాత్తర్వాత భార్యకూడా భర్తతోపాటు సంపాదించవలసిన అవసరమొచ్చింది. అంటే ఎవరి పొట్ట వాళ్ళు పోసుకోవాలన్నమాట. ముందు ముందు ఇంట్లో వున్న సభ్యులందరూ ముసలైనా, ముతకైనా ఒంట్లో శక్తివున్నంత వరకు కష్టపడి సంపాదించాల్సిందే. లేకపోతే డబ్బువల్ల ఏర్పడే సమస్యలు కుటుంబాన్ని, జీవితాలని కలతలు సృష్టించి విచ్ఛిన్నం చేస్తాయి. మనం తీసుకున్న నిర్ణయం సరైనదైనప్పుడు లోకం గురించి ఆలోచించకూడదు, పట్టించుకోకూడదు. నాకూ వయసేం మించిపోలేదు. ఇప్పుడు నాకు నలభై ఏళ్ళు. గవర్నమెంటువారి లెక్క ప్రకారం చూసినా నేనింకా చాలాకాలం ఉద్యోగం చెయ్యవచ్చు. నాలుగు డబ్బులు సంపాదించి వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా సహకరిస్తే.. ఆర్థిక సమస్యలు సర్దుకుని నీపై కుటుంబ భారం తగ్గుతుంది.

అమ్మా కమలా... కాటికి కాళ్ళు జాపి కూర్చున్నప్పుడు 'కృష్ణా రామా' అనుకోవచ్చు. ఇప్పటినుండే భగవంతుడి మీదభారం వేసినా వ్యక్తిత్వాన్ని చంపుకుని జీవించలేను'' చిన్నగా నిట్టూర్చి అందావిడ.

''అయితే ఉద్యోగం చేసే తీరుతానంటావా''

''ఆ... మీ నాన్నగారి స్నేహితుడు రామ్మూర్తిగారు రెండు వీధుల అవతల కంపెనీ ఒకటి పెట్టారు. రేపు నువ్వు నాతో వస్తే ఆయనతో నా ఉద్యోగం విషయం మాట్లాడుదాము'' అని లోపలి గదిలోకి వెళ్ళిపోయిందావిడ.

మరుసటి రోజు ఉద్యోగంలో చేరిందావిడ.

నెల రోజులు గిర్రున తిరిగాయి.

తన జీతం డబ్బులో కొంత కొడుకు చేతిలో పెట్టిందావిడ.

ఇప్పుడు కమల ఆవిడ్ని 'అత్తగారూ...'' అని తీయగా సంబోధిస్తూ, సేవ చేస్తోంది.

పార్వతమ్మగారు ఆ ఇంటికి పెద్దదిక్కు. ఇంట్లో ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా ఆవిడ పెద్దరికంతో అనుమతించాకే అమలు జరుగుతుంది.

మనుషుల్లో వచ్చిన మార్పుకి ఆవిడకి నవ్వొచ్చి మనసులోనే నవ్వుకుంటుందావిడ. అనుబంధం కన్నా డబ్బు బంధం గొప్పది. మధ్య తరగతి కుటుంబాల్లో దాని ప్రాముఖ్యత మరీ ఎక్కువ!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు